ఢిల్లీలో తగ్గిన ఉష్ణోగ్రతలు

ఢిల్లీ: శనివారం ఢిల్లీలో కనిష్ట ఉష్ణోగ్రత సాధారణం కంటే 8 డిగ్రీల సెల్సియస్ వద్ద స్థిరపడిందని వాతావరణ కార్యాలయం తెలిపింది. గురువారం నగరంలో కనిష్ట ఉష్ణోగ్రత 4.5 డిగ్రీల సెల్సియస్‌కు పడిపోవడంతో ఈ శీతాకాలంలో కనిష్ట ఉష్ణోగ్రతను నమోదు చేసింది. ఇదిలా ఉండగా, సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ (సీపీసీబీ) ప్రకారం, ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ (ఎక్యూఐ) ఉదయం 'పూర్ కేటగిరీ'లో కొనసాగింది. సీపీసీబీ ప్రకారం, ఢిల్లీలో శనివారం ఉదయం 7 గంటలకు ఎక్యూఐ 212గా ఉంది. ఢిల్లీలోని అలీపూర్, ఆనంద్ విహార్, బవానా , చాందినీ చౌక్‌లలో ఎక్యూఐ వరుసగా 205, 249, 278 మరియు 168గా నమోదైంది. ద్వారకలో సెక్షన్ 8 ఎక్యూఐ 212, నెహ్రూ నగర్‌లో 247, ఐజిఐ ఎయిర్‌పోర్ట్ (టి3) 247, రోహిణి 253, పూసా 242, ముండ్కా 264 వద్ద నమోదయ్యాయి. గరిష్ట ఉష్ణోగ్రత 23 డిగ్రీల సెల్సియస్ వద్ద స్థిరపడే అవకాశం ఉందని వాతావరణ కార్యాలయం పేర్కొంది.

కేంద్ర మాజీ మంత్రి ఇళంగోవన్ కన్నుమూత

చెన్నై : తమిళనాడు కాంగ్రెస్ నేత, కేంద్ర మాజీ మంత్రి ఈవీకేఎస్ ఇళంగోవన్ (73) శనివారం కన్నుమూశారు. ఆయన గతకొంతకాలంగా ఊపిరితిత్తుల ఇన్‌ఫెక్షన్‌తో బాధపడుతున్నారు. నవంబర్ 13వ తేదీన ఎంఐఓటీ హాస్పిటల్‌లో చేరారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. ఆయనకు భార్య, కుమారుడు ఉన్నారు. 2023 ఫిబ్రవరిలో జరిగిన ఉప ఎన్నికల్లో .. ఈరోడ్ ఈస్ట్ నియోజకవర్గం నుంచి ఆయన అసెంబ్లీకి ఎన్నికయ్యారు. ఆయన కుమారుడు తిరుమగన్ ఇవెర మృతిచెందిన నేపథ్యంలో అక్కడ ఉప ఎన్నిక నిర్వహించారు. ద్రావిడ ఉద్యమ నేత పెరియార్ ఈవీ రామస్వామి సోదరుడి మనవడే ఇళంగోవన్. చిన్న వయసులోనే ఇళంగోవన్ రాజకీయాల్లోకి వచ్చారు. 1984లో ఆయన తొలిసారి అసెంబ్లీకి ఎన్నికయ్యారు. 2004లో లోక్‌సభకు ఎన్నికయ్యారు. మన్మోహన్ సింగ్ ప్రభుత్వంలో ఆయన కేంద్ర టెక్స్‌టైల్స్ శాఖ మంత్రిగా చేశారు. తమిళనాడు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా కూడా చేశారు.

సామూహిక లైంగికదాడి

- నెట్టింట వైరల్
- 8మంది నిందితులు అరెస్టు

చిరుపుంజి : దేశంలో లైంగికదాడి ఘటనలు ఆందోళనకరంగా మారాయి. ఓ యువతిని సామూహికంగా దారుణానికి పాల్పడమే కాదు.. ఆ ఘటన దృశ్యాలను సెల్ ఫోన్‌లో చిత్రీకరించి సోషల్ మీడియాలో షేర్ చేసిన ఉదంతం అసోంలో గత నెల జరిగింది. అయితే ఈ దృశ్యాలు పోలీసుల కంటపడటంతో వెంటనే 8మంది నిందితులను అరెస్టు చేశారు. దయచేసి ఈ దృశ్యాలను ఎవ్వరూ వైరల్ చేయొద్దు అని పోలీసులు అందరికీ విజ్ఞప్తి చేశారు. పోలీసుల కథనం మేరకు ..అసోం రాష్ట్రంలో గువాహటీలోని ఓ ఆలయ పరిసరాల్లో గత నవంబరు నెల 17వ తేదీన ఓ యువతిపై సామూహిక లైంగికదాడి జరిగింది. ఆ దశ్యాలను సెల్‌ఫోన్‌లో చిత్రీకరించిన నిందితులు సామాజిక మాధ్యమాల్లో షేర్ చేశారు. అవికాస్తా వైరల్‌గా మారి పోలీసుల దృష్టికి వెళ్లడంతో లైంగికదాడికి పాల్పడిన 8 మంది నిందితులను అరెస్టు చేశారు. మరో నిందితుడి కోసం గాలిస్తున్నారు. అయితే, బాధితురాలు ఎవరు అనే విషయం తెలియాల్సి ఉంది. నిందితుల వయస్సు 18 నుంచి 23 ఏళ్ల మధ్య ఉంటుందని పోలీసులు తెలిపారు. ఈ ఘటన సమయంలో నిందితులు మద్యం మత్తులో ఉన్నట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైంది. ఈ సందర్భంగా ఆ వీడియోను సామాజికమాధ్యమాల్లో షేర్ చేయొద్దని పోలీసులు విజ్ఞప్తి చేశారు.

ప్రతి గంటకు నీట మునిగి 30 మంది మృతి

డబ్ల్యూహెచ్‌ఓ నివేదిక

జెనీవా : గత కొన్ని సంవత్సరాలుగా నీటి ప్రమాదాల వల్ల మరణాలు ఎక్కువగానే సంభవిస్తున్నాయి. నీట మునిగి మృతి చెందారనే వార్తలు తరచూ వింటూనే ఉన్నాం. ఈ నేపథ్యంలో ఒక్క 2021 సంవత్సరంలో ప్రపంచవ్యాప్తంగా మూడు లక్షలమంది నీటిలో మునిగి చనిపోయినట్లు తాజాగా వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ (డబ్ల్యూహెచ్‌ఓ)నివేదిక తెలిపింది. ఈ లెక్కల్నిబట్టి చూస్తే.. బహుశా ప్రతి గంటకు 30 మంది నీటి ప్రమాదాల వల్ల చనిపోయారని డబ్ల్యూహెచ్‌ఓ అంచనా వేసింది. ఈ మేరకు శుక్రవారం (డిసెంబర్ 13) డబ్ల్యుహెచ్‌ఓ విడుదల చేసిన నివేదిక వెల్లడించింది. ప్రత్యేకించి తక్కువ ఆదాయం, మధ్యస్థ ఆదాయం గల దేశాల్లో ఈ ప్రమాదాలు 92 శాతం సంభవించాయని ఈ నివేదిక స్పష్టం చేసింది. ఇక 2021లో ఆగ్నేయాసియా దేశాల్లో (భారత్‌తో సహా)83 వేల మరణాలు సంభవించాయి. ఇవి మొత్తం మరణాలలో 28 శాతంగా ఉందని ఈ నివేదిక పేర్కొంది.

శుక్రవారం జెనీవాలో జరిగిన సమావేశంలో డబ్ల్యూహెచ్‌ఓ డైరెక్టర్ జనరల్ టెడ్రోస్ అధనామ్ ఘెబ్రేయసస్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఈ నివేదికపై మాట్లాడారు. నీటి ప్రమాదాలపై దేశాలు అవగాహన పెంచుకోవడానికి, నివారణ వ్యూహాలకు సంబంధించి మార్గనిర్దేశం చేయడానికి, నీటి ప్రమాదాల కేసుల్ని ట్రాక్ చేయడానికి ఈ నివేదిక ఉపయోగపడుతుందని ఆంధోమ్ అన్నారు.

2000 సంవత్సరంలో ప్రపంచవ్యాప్తంగా భారత్‌తో సహా 139 దేశాల్లో నీటి ప్రమాదాలతో చనిపోయేవారి శాతం 38 శాతం తగ్గింది. 2000 కంటే.. 2021లో అంటే గడచిన ఇరవై ఏండ్లలో ఈ మరణాల నివారింపులో పురోగతి ఉన్నప్పటికీ.. వివిధ దేశాల మధ్య అసమానత ఉంది. యూరోపియన్ దేశాల్లో ఈ ప్రమాదాల్లో మరణించే వారి శాతం 68 శాతం, ఆగ్నేయాసియా దేశాల్లో 48 శాతం తగ్గినట్టు నివేదిక తెలిపింది.

ముఖ్యంగా చిన్నారులు, యువతే ఈ ప్రమాదాల్లో ఎక్కువగా చనిపోతున్నారు. ప్రపంచవ్యాప్తంగా ఐదు సంవత్సరాల కంటే తక్కువ వయసున్న చిన్నారుల మరణాల శాతం దాదాపు 24 శాతం ఉంది. ఇక 5-14 సంవత్సరాల మధ్య వయసులో గలవారు 19 శతం, టీనేజ్ అండ్ యూత్ 15-29 మధ్య వయసుగలవారు 14 శాతంగా ఉంది. భారత్‌లో 26 శాతం (30-44 మధ్య వయసు), 25 శాతం (18-29 వయసు), 17 శాతం (45-59 వయసు), 12 శాతం (0-13 వయసు), 10 శాతం (14-17), 10 శాతం (60 ఏండ్లకు పైబడినవారు)గా ఉంది.

ఎన్టీఆర్‌కు భారతరత్న సాధిస్తా

- వజ్రోత్సవ వేడుకల్లో ఏపీ సీఎం చంద్రబాబు
- 'తారక రామం' పుస్తకావిష్కరణ

విజయవాడ : నందమూరి తారక రామారావు (ఎన్టీఆర్)కు భారతరత్న సాధిస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. కృష్ణా జిల్లా పెనమలూరు మండలం పోరంకిలో ఎన్టీఆర్ లిటరేచర్-సావనీర్ అండ్ వెబ్ సైట్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్టీఆర్ సినీ వజ్రోత్సవ వేడుకలో ఆయన హాజరై ప్రసంగించారు. వేదికపై ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ నిలువెత్తు విగ్రహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా 2025 ఎన్టీఆర్ క్యాలండర్, ఎన్టీఆర్ సినీ ప్రస్థానంపై రూపొందించిన 'తారక రామం' పుస్తకాన్ని ఏపీ సీఎం చంద్రబాబుతోపాటు మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు ఆవిష్కరించారు. అనంతరం చంద్రబాబు మాట్లాడుతూ తెలుగు ప్రజల గుండెల్లో ఎన్టీఆర్ చిరస్మరణీయుడుగా నిలిచిపోతారన్నారు. ఆయన స్ఫూర్తితో స్వర్ణాంధ్ర విజన్-2047 కల సాకారం చేసుకుందామన్నారు. సినీ, రాజకీయ రంగాల్లో ఎన్టీఆర్‌ది చెరగని ముద్ర అని కొనియాడారు. జాతీయ భావాలతో ప్రాంతీయ పార్టీ నడిపిన ఏకైక వ్యక్తి అని అన్నారు. చదువు కోసం విజయవాడకు రావడం, తల్లికి సాయంగా పాలు అమ్మడం, గుంటూరుకు వెళ్లి చదువుకున్న విషయాలు తనతో పంచుకునేవారని గుర్తు చేసుకున్నారు. 1945లో మద్రాసు రైలు ఎక్కాక ఎన్టీఆర్ జైత్ర యాత్ర ప్రారంభమైందన్నారు. నెలవారీ జీతం కోసమే ఆయన మొదట ఆలోచించారని, ఎన్టీఆర్‌కు ఎల్‌వి ప్రసాద్, నాగిరెడ్డి, చక్రపాణి సహకారంతో సినీ అవకాశాలు వచ్చాయన్నారు. సాంఘిక, పౌరాణిక, జానపద, చారిత్రక పాత్రల్లో ఆయన నటించి ప్రాణం పోశారని వివరించారు. 300 సినిమాల్లో నటించారని, సినీ రంగంలో ఆయన పోషించిన ఏ పాత్ర గొప్పతనం దానిదేనని తెలిపారు. పాత్రలో పరకాయ ప్రవేశం చేసేవారన్నారు. సినిమాలో 24 ఫ్రేమ్స్ చూపించిన ఏకైక వ్యక్తి ఎన్టీఆర్ అని తెలిపారు. చిన్నరైతు బిడ్డ నుంచి తెలుగు సినీ చరిత్రలో ఎవరెస్టు శిఖరంగా ఎదిగి, పార్టీ పెట్టిన తొమ్మిది నెలల్లోనే ముఖ్యమంత్రి కావడం చరిత్రలో ఎక్కడా జరగలేదన్నారు. ఇటు వెండితెర, అటు రాజకీయాలను ఏలిన ఏకైక నాయకుడు దేశ చరిత్రలో ఒక్క ఎన్టీఆర్ మాత్రమేనని పేర్కొన్నారు. మహిళలకు మొదటిసారి ఆస్తి హక్కు కల్పించింది ఆయనేనన్నారు. కూడు, గూడు, గుడ్డ నినాదం అమలు చేశారని తెలిపారు. రాజకీయాల్లో మహిళలకు రిజర్వేషన్లకు నాంది పలికారన్నారు. మండల వ్యవస్థ తీసుకొచ్చి పాలనా వికేంద్రీకరణకు శ్రీకారం చుట్టారని కొనియాడారు. స్థానిక సంస్థల్లో ప్రత్యక్ష ఎన్నికలకు శ్రీకారం చుట్టారని, కిలో రూ.2 బియ్యం పథకం తెచ్చారని పేర్కొన్నారు. ఎన్టీఆర్ మొదటి సినిమా మనదేశం విడుదలై 75 సంవత్సరాలు పూర్తయిందని తెలిపారు. ఎన్టీఆర్ తొలిసారి నటించిన మనదేశం చిత్రం విడుదలైన 75 ఏళ్లు అయిందని గుర్తు చేశారు. ఎన్టీఆర్ మొదటి సినిమా హీరోయిన్ కృష్ణవేణి 102 సంవత్సరాల వయసులోనూ ఈ వేడుకకు హాజరు కావడం ఎంతో గొప్పవిషయమన్నారు. అచ్చ తెలుగుదనానికి, ఆత్మగౌరవానికి అర్థం ఎన్టీ రామారావు అని పేర్కొన్నారు. రంగం ఏదైనా ఆయన అడుగు పెట్టిన ప్రతిదీ సువర్ణ అధ్యాయమేనని అన్నారు. చరిత్ర ఉన్నన్నాళ్లు ఆయన ఉంటారని పేర్కొన్నారు. మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు మాట్లాడుతూ క్రమశిక్షణ, పట్టుదలకు, కార్యదక్షతకు ఎన్టీఆర్ మారుపేరన్నారు. తెలుగు భాష ఔన్నత్యానికి రామారావు అత్యంత ప్రాధాన్యత ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ జయప్రద, సినీనటి ప్రభ, ఎన్టీఆర్ కుమారులు మోహనకృష్ణ, రామకృష్ణ, మాజీ ఎమ్మెల్సీ, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు, ఎన్టీఆర్ లిటిరేచర్ కమిటీ అధ్యక్షులు టిడి. జనార్ధన్, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి హాజరైన సినీ ప్రముఖులను జ్ఞాపికలను అందించి సత్కరించారు.

ఆధార్ ఫ్రీ అప్‌డేట్..

- మరోసారి గడువు పెంపు

న్యూఢిల్లీ : ఆధార్ వివరాలను ఉచితంగా అప్‌డేట్ చేసుకునేందుకు కేంద్రం ఇచ్చిన గడువు ముగియనున్న వేళ భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ (ఉడాయ్) కీలక నిర్ణయం తీసుకుంది. ఈ గడువును మరోసారి పెంచుతున్నట్లు 'ఎక్స్' వేదికగా పోస్ట్ చేసింది. 2025 జూన్ 14వ తేదీ వరకు.. అంటే ఏకంగా ఆరు నెలలు గడువు పెంచింది. దీంతో ఆధార్ కార్డులో చిరునామా మార్పులు చేసుకోవాలనుకునేవారు వెంటనే ఆన్‌లైన్‌లో ఉచితంగా అప్‌డేట్ చేసుకోవచ్చు. యుఐడిఎఐ నిబంధనల ప్రకారం... ప్రతి పదేళ్లకోసారి ఆధార్‌కు సంబంధించిన వివరాలను అప్‌డేట్ చేసుకోవాల్సి ఉంటుంది. దీనికోసం ఆయా రుజువు పత్రాలు సమర్పించాలి. ఉచిత సేవలు 'మై ఆధార్' పోర్టల్ ద్వారా మాత్రమే అందుబాటులో ఉంటాయి. పేరు, పుట్టిన తేదీ, చిరునామా వంటి మార్పులు చేర్పులు చేసుకోవచ్చు. ఉచితం గడువు ముగిశాక మునుపటిలాగే ఆధార్ కేంద్రాల్లో రూ.50 చెల్లించి అప్‌డేట్ చేసుకోవచ్చు.

15,547 కోట్ల యూపీఐ లావాదేవీలు

న్యూఢిల్లీ : యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ), ఈ ఏడాది జనవరి నుంచి నవంబర్ వరకు రూ.223 లక్షల కోట్ల విలువ గల 15,547 కోట్ల లావాదేవీలను పూర్తి చేసినట్లు ఆర్థిక మంత్రిత్వశాఖ శనివారం వెల్లడించింది. భారత్‌కు సంబంధించిన డిజిటల్ చెల్లింపుల విప్లవం ఇతర దేశాలకు కూడా వేగంగా విస్తరిస్తోంది. ప్రస్తుతం యూపీఐ... యూఏఈ, సింగపూర్, భూటాన్, నేపాల్, శ్రీలంక, ఫ్రాన్స్, మారిషస్ వంటి కీలక మార్కెట్లలో పనిచేస్తోంది. నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) ద్వారా 2016లో ప్రారంభమైన యుపిఐ, ఒక మొబైల్ అప్లికేషన్‌తో బహుళ బ్యాంకు ఖాతాలను ఏకీకృతం చేయడం ద్వారా దేశానికి సంబంధించిన చెల్లింపుల వ్యవస్థలో విప్లవాత్మక మార్పులను తీసుకొచ్చింది. ఈ సిస్టం ద్వారా ఇబ్బందులు లేకుండా నిధుల బదిలీ, వ్యాపారులకు చెల్లింపులు, పీర్-టు-పీర్ లావాదేవీలను అనుమతినిస్తుంది. 2024, అక్టోబర్‌లో యుపిఐ (1,658 కోట్ల ఆర్థిక లావాదేవీలతో) రూ.23.49 లక్షల కోట్ల విలువ గల లావాదేవీలను ప్రాసెస్ చేసింది. 632 బ్యాంకులు యుపిఐ ప్లాట్‌ఫామ్‌కు అనుసంధానం కలిగి ఉన్నాయి.

దక్షిణ మధ్య రైల్వేకు ఆరు జాతీయ ఇంధన పరిరక్షణ అవార్డులు

న్యూఢిల్లీ: దక్షిణ మధ్య రైల్వే (ఎస్‌సీఆర్) ఆరు జాతీయ ఇంధన పరిరక్షణ అవార్డులు కైవసం చేసుకుంది. కేంద్ర విద్యుత్ శాఖ పరిధిలోని 'బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫీషియెన్సీ' నిర్వహించిన కార్యక్రమంలో కేంద్ర మంత్రి శ్రీపాద్ వై.నాయక్ 'నేషనల్ ఎనర్జీ కన్జర్వేషన్' అవార్డులను ప్రదానం చేశారు. 2024లో అత్యుత్తమ ఎనర్జీ కన్జర్వేషన్ పద్ధతులను అవలంబించినందుకు ఈ అవార్డులను అందించారు. దక్షిణ మధ్య రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ ఎలక్ట్రికల్ ఇంజినీర్ బ్రిజ్ మోహన్ మీనాతో పాటు, రైల్వే చీఫ్ ఎలక్ట్రికల్ జనరల్ ఇంజినీర్ విష్ణుకాంత్, గుంతకల్ డివిజినల్ రైల్వే మేనేజర్ విజయ్ కుమార్ అవార్డులను అందుకున్నారు.

అవార్డులు, మెరిట్ సర్టిఫికెట్లు అందుకున్న రైల్వే డివిజన్లు ఇవే..

హాస్పిటల్ సెక్టార్ విభాగంలో గుంతకల్ డివిజినల్ రైల్వే ఆస్పత్రి

రైల్వే స్టేషన్ల విభాగంలో రేణిగుంట రైల్వే స్టేషన్ (ప్రథమ స్థానం)

రైల్వే స్టేషన్ల విభాగంలో జమ్మికుంట రైల్వే స్టేషన్ (ద్వితీయ స్థానం)

హాస్పిటల్ విభాగంలో లాలాగూడలోని సెంట్రల్ హాస్పిటల్‌కు మెరిట్ సర్టిఫికెట్

రైల్వే స్టేషన్ల విభాగంలో హైదరాబాద్ రైల్వే స్టేషన్‌కు మెరిట్ సర్టిఫికెట్

రైల్వే స్టేషన్ల విభాగంలో నిజామాబాద్ రైల్వే స్టేషన్‌కు మెరిట్ సర్టిఫికెట్

ఉద్యమ కాలం నాటి తెలంగాణ తల్లినే ఆరాధిస్తాం

- తెలంగాణ తల్లి విగ్రహాలను ప్రతి గ్రామంలోనూ ప్రతిష్టిస్తాం : ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

నవతెలంగాణ-సిటీబ్యూరో

ఉద్యమకాలం నాటి నుంచి ఉన్న తెలంగాణ తల్లినే తాము ఆరాధిస్తామని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. తెలంగాణ తల్లి విగ్రహాలను గ్రామ గ్రామానా ప్రతిష్ఠించే కార్యక్రమం చేపడతామన్నారు . బతుకమ్మ అగ్రవర్ణాల పండుగ అన్న వ్యాఖ్యలను వెనక్కి తీసుకొని తెలంగాణ జాతికి కాంగ్రెస్ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. శనివారం తెలంగాణ జాగృతి సంస్థ హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తెలంగాణ తల్లిపై ప్రేమ లేనందునే సీఎం రేవంత్‌రెడ్డి రూపం మార్చారని విమర్శించారు. తల్లి చేతిలో బతుకమ్మను చూస్తే తెలంగాణ సమాజాన్ని చూసినట్టుంటుందన్నారు. మన అస్తిత్వాన్ని దెబ్బతీసే ప్రయత్నాలను అడ్డుకోవాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణ ఉద్యమంలో రేవంత్ రెడ్డి ఎక్కడా లేరని విమర్శించారు. సమావేశంలో వచ్చిన సూచనలు, సలహాల ఆధారంగా పలు తీర్మానాలు ఆమోదించామని చెప్పారు.

ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ మాట్లాడుతూ.. బతుకమ్మ పూర్తిగా బహుజన కులాల పండుగ అన్నారు. సమైక్య రాష్ట్రంలో తెలంగాణపై జరిగిన దాడి కన్నా ఇప్పుడు ఎక్కువగా జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కోదండరామ్‌ను జేఏసీ చైర్మెన్‌ను చేసింది, కేసీఆర్‌ను నాయకుడిని చేసింది తెలంగాణ తల్లే అని వివరించారు. ఎమ్మెల్సీ వాణిదేవి మాట్లాడుతూ.. శిల్ప శాస్త్రం ప్రకారం కేసీఆర్ తెలంగాణ తల్లి విగ్రహాన్ని తయారు చేయించారని తెలిపారు. తెలంగాణ తల్లి గొప్పగా ఉండాలి.. కానీ బీదగా ఉండొద్దన్నారు. కార్పొరేషన్ మాజీ చైర్మెన్ వి.ప్రకాశ్ మాట్లాడుతూ.. చేతి గుర్తు కోసం తెలంగాణ తల్లి నుంచి బతుకమ్మను మాయం చేశారని ఆరోపించారు. బీసీ కమిషన్ మాజీ చైర్మెన్ వకుళాభరణం కృష్ణమోహన్ మాట్లాడుతూ.. తెలంగాణ తల్లి ఒక ప్రతిమ కాదు సంస్కృతిక వైభవానికి ప్రతీక అని అన్నారు. తెలంగాణకు కాంగ్రెస్ ప్రభుత్వం గొప్ప పేరు తేకున్నా పర్వాలేదు కానీ ఉన్న వైభవాన్ని తొలగించొద్దని సూచించారు. తెలంగాణ సాంస్కృతిక ఉద్యమానికి ఎమ్మెల్సీ కవిత నాయకత్వం వహించాలని ప్రతిపాదించారు. ప్రముఖ రచయిత్రి గోగు శ్యామల మాట్లాడుతూ.. తెలంగాణ తల్లి అంటే రాష్ట్ర అస్తిత్వమని చెప్పారు. బ్రాహ్మణ పరిషత్ మాజీ చైర్మెన్, రిటైర్డ్ ఐఏఎస్ కేవీ రమణాచారి మాట్లాడుతూ.. దేవతామూర్తిలా ఉన్న తెలంగాణ తల్లి రూపాన్ని మార్చడం దారుణమన్నారు. తెలంగాణ తల్లి రూపకర్త బీవీఆర్ చారి మాట్లాడుతూ.. మనిషి శరీర నిర్మాణానికి వెన్నుపూస ఎంత ముఖ్యమో రాష్ట్రానికి బతుకమ్మ చిహ్నం అంతే ముఖ్యమని తెలిపారు. తెలంగాణ తల్లి దేవతా మూర్తిగా ఉండాలని కేసీఆర్ భావించారని, కేసీఆర్ సుదీర్ఘంగా చర్చలు జరిపి.. ఎంతో ఆలోచించి తెలంగాణ తల్లి రూపాన్ని తయారు చేయించారని వివరించారు. జమాతే ఇస్లామీ హింద్ అధినేత హమీద్ మహమ్మద్ ఖాన్ మాట్లాడుతూ.. ఉద్యమంలో నుంచి పుట్టిన తెలంగాణ తల్లిని మార్చడం సరికాదన్నారు.

ఆమోదించిన తీర్మానాలు: "ఒక చేతిలో జొన్నకర్ర, మరొక చేతిలో బతుకమ్మ ఉన్న తెలంగాణ తల్లి వైభవంపై పద్యాలు, కవితలు రచించి పుస్తకాలు వెలువరిస్తాం. నోట్ బుక్స్, రైటింగ్ ప్యాడ్స్ అన్నింటిపై తెలంగాణ తల్లిని ముద్రించి పిల్లలకు ఇచ్చే ప్రయత్నం చేస్తాం. తెలంగాణ తల్లికి ఆరాధనతో కార్యక్రమం మొదలుపెట్టే సంప్రదాయాన్ని ఇక ముందూ కొనసాగిస్తాం. ప్రస్తుతం రేవంత్ రెడ్డి రూపొందించిన విగ్రహానికి కాంగ్రెస్ మాతగా నామకరణం చేస్తూ తీర్మానం" అని కవిత వివరించారు.

బొగ్గు నాణ్యతా ప్రమాణాలు పాటించండి

- జీఎంలకు సింగరేణి సీఎమ్‌డీ ఆదేశాలు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

బొగ్గు నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూనే, రోజుకు కనీసం 2.7 లక్షల టన్నుల ఉత్పత్తి, రవాణాను మార్చి 31వ తేదీ వరకు సాధించాలని అన్ని ఏరియాల జనరల్ మేనేజర్లకు (జీఎం) సింగరేణి సీఎమ్‌డీ ఎన్ బలరామ్ ఆదేశించారు. శనివారం హైదరాబాద్ సింగరేణిభవన్ నుంచి ఆయన అన్ని ఏరియాల జనరల్ మేనేజర్లతో వీడియో కాన్ఫరెన్స్ సమీక్షా సమావేశం నిర్వహించారు. లక్ష్యాల సాధనలో వెనుకబడి ఉన్న ఏరియాలు ఛాలెంజింగ్‌గా పనుల్ని చేపట్టాలని చెప్పారు. బొగ్గు నాణ్యత తగ్గితే వినియోగదారుల విశ్వాసాన్ని కోల్పోతామన్నారు. ఈ ఆర్థిక సంవత్సరం ముగియటానికి ఇంకా 108 రోజుల సమయం మాత్రమే మిగిలి ఉందనీ, ఈ సమయాన్ని పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఎప్పటికప్పుడు రైల్వే అధికారులతో సంప్రదిస్తూ వినియోగదారులకు సకాలంలో బొగ్గు అందచేయాలని సూచించారు. విద్యుత్ వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో రాష్ట్రంలోని థర్మల్ విద్యుత్ కేంద్రాలకు బొగ్గు కొరత రాకుండా, తగినంత బొగ్గును అందజేయాల్సిన బాధ్యత సింగరేణిపై ఉందన్నారు. సమావేశంలో డైరెక్టర్లు డి.సత్యనారాయణరావు, జి.వెంకటేశ్వర్‌రెడ్డి, హైదరాబాద్ జనరల్ మేనేజర్ కో-ఆర్డినేషన్ ఎస్.డి.ఎం.సుభాని, జనరల్ మేనేజర్ మార్కెటింగ్ రవిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

దక్షిణ కొరియా అధ్యక్షుడి అభిశంసన

- అధికారాలు, విధులు నిలిపివేత
- అధ్యక్ష అధికారాలను స్వీకరించిన ప్రధాని

సియోల్ : దక్షిణ కొరియా అధ్యక్షులు యూన్ సుక్ యోల్‌పై శనివారం ప్రతిపక్షాలు ప్రవేశపెట్టిన అభిశంసన తీర్మానం పార్లమెంట్‌లో ఆమోదం పొందింది. జాతీయ అసెంబ్లీ ఈ తీర్మానాన్ని 204-85తో ఆమోదించింది. అభిశంసన తీర్మానం ఆమోదం పొందడంతో యూన్ సుక్ యోల్ అధ్యక్ష అధికారాలు, విధులను తాత్కాలికంగా నిలిపివేశారు. ప్రధానమంత్రి హాన్ డక్ సూ అధ్యక్ష అధికారాలను స్వీకరించారు. యూన్‌ను అధ్యక్షుడిగా తొలగించాలా.. లేదా అధికారాలను పునరుద్ధరించాలా అనే విషయాన్ని రాజ్యాంగ న్యాయస్థానం నిర్ధారించనుంది. అయితే దీని కోసం న్యాయస్థానానికి 180 రోజుల గడువు ఉంటుంది. అదే విధంగా ఒకవేళ యూన్‌ను అధ్యక్ష పదవి నుంచి తొలగిస్తే నూతన అధ్యక్షున్ని ఎన్నుకోవడానికి 60 రోజుల్లో జాతీయ ఎన్నికలను నిర్వహించాల్సి ఉంటుంది. శనివారం తీర్మానం ఆమోదం పొందడంతో అభిశంసనకు గురైన మూడో దక్షిణ కొరియా అధ్యక్షుడిగా యూన్ నిలిచారు.

ARUNJYOTI BIO VENTURES LIMITED
Door No.1-98/1/JSIC/6F/604-B6th Floor, Jain Sadhguru Capital Park, Beside Image Gardens, Madhapur, Shaikpet, Hyderabad- 500081, Telangana, CIN:L01400TG1986PLC062463

అసాధారణ సర్వసభ్య సమావేశం, రిమోట్ ఇ-ఓటింగ్ సమాచారపు ప్రకటన

1) ఈ ప్రకటన ద్వారా తెలియజేయునది ఏమనగా ఇజిఎం నోటీసులో పేర్కొన్నట్లుగా వ్యాపార నిర్వహణకు సంబంధించి వీడియో కాన్ఫరెన్సింగ్ మరియు ఇతర ఆడియో-విజువల్ మీన్స్ (వీసి) ద్వారా కంపెనీ యొక్క అసాధారణ సర్వసభ్య సమావేశం (ఇజిఎం) సోమవారం, 6 జనవరి, 2025న ఉ.11.00గం.లకు నిర్వహించబడును.

2) సర్యులర్ నెం.14/2020 తేది.8 ఏప్రిల్,2020 మరియు సర్యులర్ నెం.17/2020 తేది.13 ఏప్రిల్, 2020, 22/2020 తేది.15 జూన్, 2020, 33/2020 తేది.28 సెప్టెంబర్, 2020, 39/2020 తేది.31 డిసెంబర్, 2020, 10/2021 తేది.23 జూన్, 2021, 20/2021 తేది.08 డిసెంబర్, 2021 మరియు సర్యులర్ నెం.03/2022 తేది.5 మే, 2022, 11/2022 తేది.28 డిసెంబర్, 2022 మరియు 09/2023 తేది.25.09.2023 మరియు ఎంసిఏ సర్యులర్ నెం.19 సెప్టెంబర్, 2024 (ఉమ్మడిగా 'ఎంసిఏ సర్యులర్లు'గా పేర్కొనబడును) మరియు సెబీ సర్యులర్ నెం.సెబీ/హెచ్ఓ/సిఫ్‌డి/సిఎండి1/సిఐఆర్/పి/2020/79, తేది.12 మే, 2020 మరియు సెబీ/హెచ్ఓ/సిఫ్‌డి/సిఎండి2/సిఐఆర్/పి/2021/11 తేది.15 జనవరి, 2021 మరియు సెబీ/హెచ్ఓ/సిఫ్‌డి/సిఎండి2/సిఐఆర్/పి/2022/62 తేది.13 మే, 2022 మరియు సెబీ/హెచ్ఓ/సిఫ్‌డి/సిఫ్‌డి-పిఓడి-2/పి/సిఐఆర్/2023/167 తేది.07 అక్టోబర్, 2023తో కలుపుతూ సర్యులర్ నెం.20/2020 తేది.05 మే, 2020తో చదవగల ఎంసిఏ జనరల్ సర్యులర్ నెం.02/2021తో చదవగల కంపెనీల చట్టం, 2013లోని వర్తించు నియమాలను అనుసరించి వీసీ/ఓఏవిఎం ద్వారా ఇజిఎం నిర్వహించబడును. ఏజిఎంకు భౌతిక సభ్యుల హాజరు అవసరంలేదు. వీసి/ఓఎం ద్వారా ఇజిఎంకు హాజరు అవుతున్న సభ్యులు ఇజిఎం నోటీసుల